# బతుకు బజారు

—జలంధర్

శంకరానికి భలే వు(క్రోషంగా వుంది. తను చిరాకు పడ్డం తప్పే అయినా వాళ్ళు రియాక్టవకుండా వదిలిపెట్టడం మరింత బాధగా వుంది. చేతకాని తనం వల్లే తనకి వుడుకుమోత్తనం పెరిగిపోతూందని శంకరానికి తెలుస్తూనే వుంది. అందుకే మరింత కచ్చిగా వుంది.

సాయంకాలం ఆరు గంటలకే హోటల్లో యిడ్లీ అయిపోయిందన్నాడు. దోసె, వుూతప్పం అని ఏకరువు పెడుతూ వుంటే కాఫీ తెమ్మని కసురుకున్నాడు తను. తన గొంతు తనకే కటువుగా అసందర్భంగా వినిపించింది. బిల్లు యిస్తున్నప్పుడు సర్వరు కంట్లో యీసడింపు వుందా? తనకలా కనపడిందా?

అందుకే పేవ్‌మెంట్ల మీద టిఫిన్ బళ్ళు జనాభాతో పోటీబడి పెరిగిపోతున్నాయ్.

సాధారణంగా కండక్టర్లందరూ రూపాయి బిళ్ళిస్తే డెబ్భై పైసల టిక్కట్టూ యిరవై పైసల బిళ్ళా యిచ్చేస్తారు బుద్ధిగా. కాని శంకరానికి ఖాదస్తులే దొరుకుతారు. టిక్కెట్టు తీసి చేత్తో పట్టుకుని మర్రీ "ఏ స్టేజికి" అంటూ నొక్కించి అడిగి "రూపాయి పావలా సార్" అని మళ్ళీ చెయ్ జాపేడు, మళ్ళీ పియ్యం మీద జోకులు కూడానూ ఆ రద్దీలో.

పేంట్లు చూదానని కార్నరు షాపుకెళితే వాడు అతి మర్యాదగా పలకరించి ఆరు వందల రకం చూపెట్టేడు. "మీ దగ్గర ఎక్స్‌పోర్టు రిజెక్ట్సు వుంటాయి కదా" అంటే వెంటనే సంత గుడ్డలు చూపెట్టి "నైంటీ ఫైవ్" అన్నాడు.

"కొంచెం బెటరు క్వాలిటీ..." అనే సరికి మళ్ళీ మూడొందల ఏభైదొకటి తీసి "ఇంకా చీప్‌లో కూడా వున్నాయండీ" అంటూ రెండొందల తొంభై కొకటి చూపెట్టి "ఇది మీ రేంజిలో మీకు బెస్టుగా సూటవుతుంది సార్" అంటూ తగులుకొన్నాడు.

ఒద్దంటూనే వున్నా అప్పటికే పదీ పదకొండు పేంట్లు హేంగర్స్ నించి లాగి కుప్ప పడేసేడు.

మొహమాట పెట్టి ఏదో ఒకటి అంటగట్టేస్తే ఎలా అని శంకరంలో అప్పటికే ఫ్రిజిడిటీ పెరిగిపోతూంది. 'మీ రేంజి' అనే మాట సేల్స్‌మేన్ నోట వినేసరికి ముల్లు గుచ్చుకుంది. "రేంజి సంగతెలా వున్నా మీ పుష్టింగే విపరీతం" అంటూ చిర్రుబుర్రు లాడినప్పుడు కోపం దాచుకోలేకపోయేడు శంకరం. "మీ యిష్టంసార్" అన్నాడేగాని తల తిప్పేసుకుంటున్నప్పుడు వాడి మొహంలో అవహేళన నవ్వు వెలుగుతూనే వుంది.

డిస్నే చూసి షాపులో అడుగు పెట్టడం పొరపాటేనని మనసులో చెంపలేసుకున్నాడు శంకరం.



వారం రోజుల కిందట సరళ అలా అనకపోతే మరో పేంటు కొందామనే ఆలోచన యింత తొందరగా ఫైనల్ చేసుకునే వాడే కాదు శంకరం.

ఆ రోజు యం.డి. గదిలో తను కూడా వున్నానని ఎవరు చెప్పేరంటే, "స్ప్రింగ్ డోర్సు కింద నుంచి మీ పేంటు కనపడ్డం లేదా, రాజీ కూడా పోల్చుకుంది" అన్నది సరళ. ఆ పేంటు నీకు ట్రేడ్ మార్క్ అని ఆమె అనకపోవచ్చు. అలా స్ఫురిస్తుందంటే-కనీసం తను అలా గింజుకుంటాడనుకుంటే ఆ పిల్ల ఆ మాట అనదనే శంకరం నమ్మకం. కాని అప్పుడనిపించడం కాదు, ఆమె కనిపించినా వూహలో మెదిల్నా అదే దెప్పిపొడుపు కలుక్కుమంటూంది వారం రోజులుగా. ఛీ—మిడిల్ క్లాస్ ప్రిజుడిస్.

బస్సు దిగి రూం దారి పట్టేసరికి డబ్బాలో బియ్యం అయిపోయేయని గుర్తొచ్చింది. బియ్యం చూపెట్టమంటే "పదీ నలభై సార్ సూపర్

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఫైవ్'' అని ఓవరు పళ్ళు బైటపెట్టాడు. ''అంత కంటె తక్కువలో లేవా?'' అంటే ''ఓయస్! తొమ్మిదిన్నర'' అంటూనే ముతక రాళ్ళ బియ్యం చేరెడు తీసి ''యివి ఆరున్నర సార్ ఆర్డినరీ'' అంటూ మొహం ముందుం చేడు తూచే కుర్రాడు. పక్క బస్తాలో ఏడూ ముప్పైవి చూపెట్టి రెండు కేజీలు కట్టమన్నాడు. ''పదకొండ్రూపాయిలూ పన్నెండ్రూపాయిలూ బియ్యం పదేసి కేజీలు ప్లాస్టిక్ బేగుల్లో పేక్ చేసి అందాల టేగ్‌లు అతికించి కార్లలో వచ్చే వాళ్ళకి అంటగట్టండి'' అన్నాడు ఓవరు మీద కసి తీర్చుకుంటున్నట్టు శంకరం.

''అవున్సార్. అవి వాళ్ళకే. మనం తిన్లేం. బాగు చేయించి పేక్ చేసేమంటే మరో రూపాయి పోయినా ఫరవాలేదు, మీరు చెప్పింది కరెక్ట్ సార్'' అని మళ్ళీ పళ్ళు చూపించేడు ఓవర్.

రూంకొచ్చి చతికిలబడి కొత్త పత్రిక పేజీలు తిప్పుతున్నాడు శంకరం. వీళ్ళక్కూడా మన్ మోహనుడే దొరికేడు. ఒకప్పుడు బామ్మగారు అప్పడాల కర్ర ఎంత పాపులరో ఇవాళ మన్‌మో హన్‌సింగూ అయ్యోమ్మెప్పూ అంత డిమాండ్‌లో వున్నారు కార్టూన్లకి.

మన గో.పి. (గోడమీది పిల్లి) గారికే ధైర్యం లేకపోయింది. మరో స్వాతంత్ర్య పోరాటమే గతి అని పెడితే ''నర్సింవ్వారావు తెలుగు వాడయ్యా బాబు హెడ్డింగులో పన్నేవిటి'' అని లాగేసేడు. పైగా యమ్.డి గారికి ట్రేడ్ పాలసీ మీద రేడియో కామెంటు రాసి పెట్టాలిట.

''చిదంబర రహస్యం అది రాద్దునా'' అంటే, ''షార్ట్ కామెంటుకదా మన పాండిత్యం కూడా ఎందుకు! గండం గడిచి గట్టెక్కాం, ఆశావహంగా వుంది అంటే పోలా, మంత్రిగారు మన యండికి తెల్సు కూడానూ'' అని చల్లగా బయట పెట్టాడు. పురమాయింపు. ప్రయివేటు డిస్కషనుకే తప్ప దలేవీ బైటకి చెప్పుకునీవి కావన్న మాట.

మీడియా గురించి పగటి కలల్లో పడిపోయా వాడే శంకరం, కాని వెంకటేశం అడ్డవొచ్చేడు.

వెంకటేశం ఎప్పుడొచ్చినా హడావుడిగా ప్రవే శించును. అది అతగాడి రూలు.

''గురూ! రెండు గుడ్లు తెచ్చేను. బ్రహ్మాండంగా ఆమ్లెట్లు వేసుకుందాం. నువ్వెలాగూ టీ పోస్తావు కదా'' అంటూ తయారైపోయేడు.

తెర తొలగించి కిచెన్ తెరుస్తూ వుంటే శంక రానికి చప్పున గుర్తొచ్చింది ''అంతా బావుందిగానీ స్టౌలో కిరసనాయిల్లేదోయ్'' అన్నాడు.

''తగిలిందీ నీక్కూడా పీడీయస్ దెబ్బ. రేషను కార్డు కూడా కేష్ చేసేసుకుంటూందా ఇంటా విడి?

వాళ్ళకి గేసు వుంది కదా!''

''అరవకయ్యా బాబూ! పద బజార్ను పడదాం. ఇంక చేసేదేవుంది?''

చక్రాలు కదుల్తున్నాయి_ అన్నీ వున్న అంగ ట్లోకి!


ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

మరియు

ఎమెస్కో క్రౌన్ బుక్స్

ఏలూరు రోడ్: విజయవాడ-2

# 'నవలా భారతి' ఉగాది నవలల పోటీ!

# ఉత్తమ నవలకు రూ. 25,000/-

## మరో నవలకు రూ. 7,500/- వేరొక నవలకు రూ. 7,500/-

## పోటీకి నవలలు అందవలసిన ఆఖరి తేదీ: 15-3-92

* తేట తెనుగుతనం - సమకాలీన జీవనం - మారుతున్న సామాజిక విలువలు - సాంకేతిక రంగంలో దేశకాల పరిస్థితులు నేపథ్యంగా 'నవలా భారతి' ఉగాది నవలల పోటీకి రచనలు ఆహ్వానిస్తున్నాం. * రచయిత (త్రు)లు తమ రచనలను తెల్ల కాగితానికి ఒక వైపునే రాయాలి. రచన 200 అరఠావులకు పరిమితం కావాలి.
* బహుమతికి ఎంపికయిన నవలల్ని సీరియల్‌గా ప్రచురించే హక్కు ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, నవలగా ప్రచురించే హక్కు మెస్సర్స్ ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్‌కి మాత్రమే వుంటుంది.
* పై నగదు మినహా రచయితకి మొదటి ముద్రణకు మరే విధమైన ఇతర నగదుపారితోషికం వుండదు. రచయిత(త్రు)లు గమనించమనవి.

మీ రచనలు పంపవలసిన చిరునామా: 'నవలా భారతి' నవలల పోటీ ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక పోస్టుబాక్స్ నెం: 712, విజయవాడ 520 010. * రచనలపై రాగల వివాదాలకు రచయి(త్రు)తలదే బాధ్యత.

ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రికలో నవల ప్రచురింపబడిన తర్వాతనే నగదు బహుమతి అందజేయడం జరుగుతుంది.